భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

గజపతినగరం: మండలం కేంద్రంలో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా క్రీస్తు ప్రభువు గురించి బైబిల్‌లో ఉన్న గ్రంథాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: వేపాడ – వల్లంపూడి జంట గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేపాడ క్రైస్తవుల సహాయమాత దేవాలయం రెవ.ఫా.బి.బాలరాజు నేతృత్వంలో జంట గ్రామాల్లో పుర ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస : మండలంలోని వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా క్రీస్తును శిలువ వేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.



కొత్తవలస జంక్షన్‌లో శిలువతో ఊరేగిస్తున్న క్రైస్తవులు

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మానవాళి పాపాలు కడిగేందుకు యేసుక్రీస్తు ప్రభువయ్యారని ఉపదేశీ మాస్టర్ లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా మండల కేంద్రమైన మెరకముడిదాం ఆర్‌సీఎం చర్చ్‌కు సంబంధించిన క్రైస్తవ సోదరులు గ్రామంలో వున్న వీధులలో శిలువ మార్గము నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు.



గజపతినగరం: ప్రార్థనల్లో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవ సోదరులు



వేపాడ: గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరుల ర్యాలీ



మెరకముడిదాం: శిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవ సాదరులు

క్లుప్తంగా

వాహన తనిఖీలు



పెదమానాపురం సంత తోట వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

దత్తిరాజేరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెదమానాపురం సంత తోట వద్ద జాతీయ రహదారి 26పై ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి వాణీశ్రీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాల్లో తరలించే ప్రతి దానికి బిల్లులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సంబంధిత పత్రాలను చూపించాలని కోరారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



రామాయణ అనుగ్రహ భాషణం చేస్తున్న రామసుబ్బారావు

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బ్రహ్మశ్రీ రాళ్లపల్లి రామసుబ్బారావు శుక్రవారం సాయంత్రం చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామసుబ్బారావు రామాయణ అనుగ్రహ భాషణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం రేపు

బొండపల్లి: మండల కేంద్రంలోని బంగారమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 31 ఆదివారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలతో పాటు, ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటు, పెద్ద ఎత్తున వివిధ కార్యక్రమాలును నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి..



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ వెంకటేష్

విజయనగరం ఫూల్‌బాగ్: అటవీ ప్రాంతంలో వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ అధికారి ఎస్. వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఫూల్‌బాగ్‌లోని అటవీశాఖ జిల్లా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా బడ్జెట్, ఖర్చులు, వచ్చే ఏడాదికి సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. బేతనాపల్లిలో నిర్మిస్తున్న నగర వనం పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు బి. అప్పలరాజు, త్రినాథరావు, ఆర్. రాజశేఖర్‌బాబు, సింధు, డీఆర్‌ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

తొలగిన రహదారి కష్టాలు



బీసీ కాలనీ రోడ్డు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో స్థానిక కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్ చొరవతో రూ.6.5 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. బీసీ కాలనీ నుంచి మెయిన్ రోడ్డు వరకు రోడ్డు వేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా కాలువలు కూడా నిర్మించారు. దీంతో ఎట్టకేలకు బీసీ కాలనీ ప్రజలకు రహదారి కష్టాలు తీరాయి. రోడ్డు వేయాలని గతంలో పలుమార్లు అధికారులు, పాలకులను కోరినా ఎవ్వరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రోడ్డు వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేద్దాం

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



గరివిడి మండలం శివరాం గ్రామసభలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లిరూరల్ (గరివిడి): పేదల బతుకులు బాగుపడాలన్నా.. వారి జీవితంలో ఆర్థిక ప్రగతి కనిపించాలన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా చేరువ కావాలన్నా.. రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలన్నా.. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అందరమూ కలిసికట్టుగా మరోసారి ఆయనను సీఎం చేద్దామన్నారు. గరివిడి మండలంలోని శివరాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన నాయకులు, మహిళలు బొత్సకు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు చేశామని, మీ కుటుంబాల్లో ఏదైనా మేలు జరిగిందని నమ్మితే మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. శివరాం గ్రామంలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.16కోట్లు నేరుగా జమచేసినట్టు వెల్లడించారు. పేదపిల్లలు చదువుకుని శివరాం పాఠశాలను రూ.1.20కోట్ల నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేశామన్నారు. ప్రజలు, రైతులకు సేవలందించేందుకు వీలుగా సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను గ్రామంలో ఏర్పాటుచేశామని చెప్పారు. పేద కుటుంబాల పిల్లలు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆంగ్లమాధ్యమ చదువుతో పాటు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, విద్యాకానుకలు వంటి బృహత్తర కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పింఛన్ దారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటివద్దనే పింఛన్ అందజేసే వలంటీర్ వ్యవస్థను జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదని, పింఛన్ తీసుకోవటానికి లబ్ధిదారులు నిరీక్షణ చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు ఉండేవని, ఇది నిజమా? కాదా? ఒకసారి ఆలోచన చేయాలన్నారు. ప్రజలందరికీ మేలు చేయగలిగామన్న ధైర్యంతో ఓట్లు అడుగుతున్నామని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో పెద్ద మనస్సుతో ఆలోచన చేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, సర్పంచ్ గవిడి విజయ, ఎంపీటీసీ సభ్యురాలు గవిడి లక్ష్మి, నాయకులు గవిడి శ్రీధర్, దాలినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు జి.రామకృష్ణరాజు, జి.శ్రీరాములనాయుడు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



పర్ల గ్రామంలో ఎంపీ బెల్లానకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

చీపురుపల్లి: ఐదేళ్ల పరిపాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. మండలంలోని పేరిపి, రావివలస, ఇటకర్లపల్లి, పర్ల పంచాయతీలతో పాటు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెండవ ఎంపీటీసీ ప్రాంతంలో శుక్రవారం ప్రచారం నిర్వహించిన అనంతరం జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శిరీషతో పాటు మహిళలు విజయ తిలకం దిద్ది హారతులు పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా పథకాలు అమలు జరిగాయన్నారు. అభివృద్ధి విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. కూటమి పేరుతో వచ్చే మోసగాళ్లను నమ్మొద్దని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



బొద్దాంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

వేపాడ: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఎస్.కోట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. బొద్దాం, పాటూరు, సోంపురం, అరిగిపాలెం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. వల్లంపూడి ఎస్ఐ రాజేష్ నేతృత్వంలో నిర్వహించిన కవాతులో పోలీసులు, కేంద్ర బలగాలు సుమారు 70 మంది పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం జగన్‌ను సీఎం చేయాలి



వంగర గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, పక్కన ఎమ్మెల్సీ పెనుమత్స

- ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

దత్తిరాజేరు: రాష్ట్ర భవిష్యత్ కోసం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. వింద్యవాసి, వంగర గ్రామాల్లో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలను మహరాణులను చేయాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు వారి పేరిట మంజూరు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేద, మధ్య తరగతి పిల్లల భవిష్యత్ కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి పేరుతో వస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే ప్రజల సమస్యలు పరిష్కరించబడుతున్నాయన్నారు. వీటన్నింటిని గుర్తించి ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ కూటమిని ఇంటికి పంపించాలన్నారు. ప్రచారంలో ఎమ్మెల్యే కుమారుడు గురునాయుడు, వింద్యవాసి, వంగర సర్పంచ్‌లు రంభ చంద్రశేఖర్, దత్తి నారాయణప్పలనాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కొత్తవలస: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థుల కోసం మండల కేంద్రంలో గల భారత్ డిఫెన్స్ అకాడమి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99854 12929, 83310 00746 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

జామి: మండలంలోని మల్లివీడు అలమండ విద్యుత్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్‌లైన్లు మెయింటెనెన్స్ పనులు నిమిత్తం ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఫీడర్ పరిధిలో ఉన్న శిరికిపాలెం, కలగాడ, మామిడిపల్లి, చంద్రంపేట, తలారి, సత్యనారాయణ పురం గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్

గంట్యాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ కోరారు. మండలంలోని పెణసాం, చినమానపురం గ్రామాల్లో కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అవినీతి లేని పాలన అందించామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందించారని చెప్పారు. గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న బొత్స అప్పలనరసయ్యకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న బెల్లాన చంద్రశేఖర్ విజయానికి పాటు పడాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, మండల పార్టీ అధ్యక్షుడు జాగరపు అప్పారావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు కె.విజయ్ కుమార్, పార్టీ నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు, లెంక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన తప్పనిసరి



మెరకముడిదాం: గరుగుబిల్లిలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ



జామి: ఎ.ఆర్.పేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ



లక్కవరపుకోట: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గోపాలరావు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్.ఐ కె.లక్ష్మణరావు పేర్కొన్నారు. మండలంలోని బిల్లలవలస గ్రామంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రజలు పాటించాల్సిన నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని బుధరాయవలస ఎస్ఐ బి.లోకేశ్వరరావు హెచ్చరించారు. గురువారం రాత్రి గరుగుబిల్లి గ్రామంలో సాధారణ ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాల్సిందేనని, అలా కాకుండా గొడవలు పడితే బైండోవర్ కేసులతో పాటూ అవసరమైతే రౌడీషీట్ కట్టాల్సి వుంటుందని ఆయన హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ కొండలరావు, వైస్సార్‌సీపీ నాయకుడు లోకేష్ పాల్గొన్నారు.

జామిలో..

జామి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా నేతలు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ వీరబాబు కోరారు. మండలంలోని అన్నంరాజుపేట, ఎం.కె.వలస గ్రామాల్లో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఎటువంటి వివాదాలకు పోకూడదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కవరపుకోటలో...

లక్కవరపుకోట : రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతకరమైన వాతావరణంలో నిర్వహించుకుందామని ఎస్ఐ గోపాలరావు అన్నారు. మండలంలోని రేగ పంచాయితీ శివారు నీలకంఠాపురం గ్రామంలో ఎన్నికల నియమావళి, నిర్వహణ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఎవరు గొడవలు పడవద్దని ఈ సమయంలో కేసు నమోదైతే శిక్షలు తప్పవని తెలిపారు. ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద దుంగ వెంకటరమణ, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.